# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- రానున్న దసరా నవరాత్రుల నుండి నూతన జీఎస్టీ రేట్లు అమల్లోకి రానున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- వక్ఫ్ (సవరణ) చట్టం 2025పై స్టే విధించేందుకు సుప్రీంకోర్ట్ నిరాకరించింది.
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(AI) పై నిబంధనలను పెంచాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.
- స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం 60 కోట్ల మంది ప్రజల్ని బహిరంగ మలవిసర్జన దురలవాటుకు దూరం చేసిందని కేంద్రమంత్రి సీ ఆర్ పాటిల్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న దసరా నవరాత్రుల నుండి నూతన జీఎస్టీ రేట్లు అమల్లోకి రానున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. భావితరం జీఎస్టీ సంస్కరణలతో ప్రభుత్వం అనేక వస్తువులపై జీఎస్టీ ని భారీగా తగ్గించిందని చెప్పారు. బీహార్ లోని పూర్ణియా జిల్లాలో షీషా బాడి మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ... జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసరాల ధరలు చౌకగా మారుతాయని వీటితో గృహిణులు ఎక్కువ ప్రయోజనం పొందుతారని తెలిపారు.

(వాయిస్ బైట్...33 సెకన్లు)

అదే విధంగా బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం ప్రాంతాలను అక్రమ చొరబాటుదారుల నుండి విముక్తి చేయడానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అంతకముందు పూర్ణియా జిల్లాలో 40 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. అలాగే కొత్తగా నిర్మించిన పూర్ణియా విమానాశ్రయాన్ని కూడా ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వక్ఫ్(సవరణ)చట్టం-2025పై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కొన్ని సెక్షన్లకు మాత్రం కొంత రక్షణ అవసరమని తీర్పు వెలువరించింది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టాన్నిపూర్తిగా నిలిపివేయాలని దాదాపు 100కు పైగా పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. వీటన్నింటిపై విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం.. వక్ఫ్ బోర్డులో ముస్లిం సభ్యుల సంఖ్య కచ్చితంగా మెజార్టీలో ఉండాలని పేర్కొంది. వక్ఫ్ బోర్డ్ లో అత్యధికంగా ముగ్గురు లేదా నలుగురు ముస్లిమేతర సభ్యులు ఉండాలని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా ముస్లిమే ఉండాలని తెలిపింది. ఇక వక్ఫ్ (సవరణ) చట్టం-2025 లో కీలక నిబంధనను మాత్రం నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కనీసం ఐదేళ్లపాటు ఇస్లాంను అనుసరించిన వ్యక్తి మాత్రమే ఆస్తిని వక్ఫ్ చేయడానికి అవకాశం ఉంటుందన్న దానిని నిలిపివేసింది. ఒక వ్యక్తి ఇస్లాంను అనుసరిస్తున్నట్లు నిర్ణయించేలా నిబంధనలు తయారయ్యేవరకు ఇది అమల్లో ఉండదని స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(AI) ఓ వైపు వేగంగా అభివృద్ధి చెందుతుండటంతో సమాంతరంగా నిబంధనలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వికసిత్ భారత్ కోసం AI రోడ్ మ్యాప్ అండ్ ఫ్రాంటియర్ టెక్ రిపోజిటరీపై నీతి ఆయోగ్ నివేదికను మంత్రి ఈరోజు న్యూఢిల్లీలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగవంతమైన వృద్ధి పట్ల ప్రజలు స్పృహతో ఉండాలని సూచించారు. ఎప్పటినుండో పరిష్కారం కాని సమస్యలకు సైతం ఏఐ పరిష్కార మార్గాలను చూపుతోందని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ ...

(వాయిస్ బైట్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జార్ఖండ్ హజారీబాగ్ జిల్లాలోని కరండి గ్రామంలో ఈరోజు ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు నక్సలైట్లు మరణించారు. మరణించిన నక్సలైట్లలో సెంట్రల్ కమిటీ సభ్యుడు సహదేవ్ సోరెన్ పై కోటి రూపాయల రివార్డు ఉండగా రఘునాథ్ హెంబ్రోమ్ పై 25 లక్షలు, బిర్సెన్ గంజు పై 10 లక్షల రూపాయల రివార్డు ఉంది. CRPF 209 కోబ్రా బెటాలియన్ తో కలిసి హజారీబాగ్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు నిర్విరామంగా కృషి చేస్తోంది. సేవా పర్వ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు అంశాలపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా పర్యావరణ సమతుల్యత, సంరక్షణకు ప్రభుత్వం అనుసరిస్తున్న పలు విధానాలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ బైట్...120 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“స్వచ్ఛతా హి సేవా” కార్యక్రమం దేశవ్యాప్తంగా 12 కోట్లకు పైగా గృహాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి దారితీసిందని కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీ ఆర్ పాటిల్ తెలిపారు. స్వచ్ఛతా హి సేవా 2025 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఈరోజు ఆయన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సీ ఆర్ పాటిల్ మాట్లాడుతూ... “స్వచ్ఛతా హి సేవా” కార్యక్రమం 60 కోట్ల మంది ప్రజల్ని బహిరంగ మలవిసర్జన దురలవాటుకు దూరం చేసిందన్నారు. అంతేకాకుండా సురక్షితమైన, పరిశుభ్రమైన పారిశుద్ధ్య పద్ధతులను అవలంబించేలా వారికి సాధికారత కల్పించిందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల భాగస్వామ్యం లేకుండా వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోలేమని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. “చట్టసభల్లో మహిళా సాధికారిత” అనే అంశంపై తిరుపతిలో జరిగిన జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలను సామాజిక, ఆర్థిక, రాజకీయ, క్రీడా రంగాల్లో మరింత ముందుకి తీసుకువచ్చేలా రెండు రోజుల పాటు చర్చలు జరిగాయన్నారు. బాలికలను విద్యా వంతులను చేయాలని, కొన్ని చోట్ల పాఠశాలలు దూరంగా ఉండటం వల్ల కొందరు చదువుకు దూరం అవుతున్నారని, అలాంటి చోట సాంకేతిక సహాయంతో బాలికలు విద్యావంతులు అయ్యేలా చూడాలన్నారు. గ్రామంలోని ప్రతి మహిళకు పని కల్పించి, ఆర్థికంగా స్వతంత్రులను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కొంకణ్, గోవా, బీహార్, ఉత్తరప్రదేశ్‌లతో సహ ఈశాన్య భారతదేశంలో రేపు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో కూడా రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =